# ముక్కోణపు ప్రేమ

"ప్రేమా నీకు నా గురించి తెలియదు, భర్తగా నేను నీకు న్యాయం చెయ్యలేకపోతున్నాను. నన్ను ప్రేమించే, ఇంకొక అమ్మాయిని కాదని, నిన్ను పెళ్ళి చేసుకున్నాను, కాని ఇప్పుడు ఆ అమ్మాయి చచ్చిపోతాను అంటోంది" అన్నాడు శ్యామ్ కోపంగాను.

ప్రేమ పక పక నవ్వి "భలేవారే, మీ మీద అంత ప్రేమ ఉన్న అమ్మాయిని కాదని నన్ను ఎందుకు చేసుకున్నారు?" అంది.

"మొదట్లో చాలా గర్వంగా ఉండేది. అది నాకు నచ్చలేదు. పైగా ఆ అమ్మాయికి తండ్రి లేడు. దాంతో వాళ్ళ అమ్మని కాదని సినిమాలు షికార్లు చేసేది. పైగా, మేము వాళ్ళింట్లో అద్దెకున్నాం కదా? అని, రేషన్‌షాపు నుంచి మా ఇంట్లోకి తెచ్చేటప్పుడు వాళ్ళవి కూడా తేరా అని మా అక్క రేషన్ కార్డు, డబ్బులూ చేతిలో పెట్టేది. సరే పాపం వాళ్ళకి మగ దిక్కులేదా కదా? అని, సహాయంచేసివాణ్ణి, ఎప్పుడేనా ఏదేనా లెక్క తెలియకపోతే వచ్చి అడిగేది. ఒకసారి అన్నాను, ట్యూషన్ పెట్టుకోవచ్చును కదా అని, అయితే ఆ డబ్బులు మీకే ఇస్తాను మీరే చెప్పండి అంది. అప్పుడు కొంచెం తటపటాయించి రేపు ఏ విషయం చెపుతాను, నేను బి.ఏ చదువుకుంటున్నాను కదా? నాకు కాళీ ఉండకపోవచ్చును అన్నాను.

సరే, ఆలోచించి పది రూపాయలు ఇస్తాను లెక్కలు ఒక్కటే కదా? అక్కనీ, బావనీ, అడగవలసి వస్తోంది. అనుకుని ట్యూషన్‌కి ఒప్పుకున్నాను ఈ చీర ఎలా ఉంది! ఈ జాకెట్టు మ్యాచైయిందా అని అడిగేది. నీకు చదువు మీద ధ్యాస లేదు. ఎస్.ఎల్.సీ పరీక్షలంటే చాలా గట్టిగా చదవాలి అన్నాను. దాంతో రెండు రోజులు రావడం మానేసింది" అన్నాడు శ్యాము.

"ఇంతకీ ఆ అమ్మాయి పేరు చెప్పారు కాదు" అంది ప్రేమ.

పక పకా నవ్వి శ్యాము, "కాళి" అన్నాడు.

"అదేం పేరు?" అంది ప్రేమ.

"కాళిందిని అసలు పేరు, కాళీ, కాళీ అనేవారు అందరూను. సరే, అ తర్వాత నాకు కనిపించలేదు, కాని మా అక్క చెప్పింది. కాళి ఫ్లూటు నేర్చుకుంటోందట, ఎదురు ఇంటిలో కొత్తగా వచ్చిన వాళ్ళ అబ్బాయి అని చెప్పి" పైగా వాళ్ళు సన్నాయి వాయిస్తారు,

మంగలోళ్ళుట'' అంది, దాంతో కాళీ అంటే కొంచెం నా దృష్టిలో స్వల్పంగా కనిపించింది, వీధిలో, ఎదురైనా పలకరించేది కాదు. నాకేం? నేను మాట్లాడలేదు. కొంచెం ఇంటి పట్టున ఉండకుండా ఫ్రెండ్సు ఇంట్లో చదువుకునే వాణ్ణి, ఒకటి రెండు మాట్లు మా అక్కయ్య దగ్గర అందిట, మీరు ఇల్లు కాళీ చెయ్యాల్సి వస్తుంది అని. మా బావ ఆఫీసుకి దగ్గర. అంతకీ గట్టిగా అంటే చూద్దాంలే! అని నేను వినీ విననట్లు ఊరుకున్నాను. బి.ఏ పరీక్షలు అయ్యాక మా వూరు వచ్చేసాను. ఆ వేసంగిలో సాయంకాలం చెరువులో నీళ్ళు పోసుకుంటూంటే నువ్వు నీళ్ళకని బిందెతో వచ్చావు. పరికిణీ లంగాలోనూ, చందనపు బొమ్మలా చక్కెర బొమ్మలా... తళుక్కుమంది నా మనసు. ఏదో నా ఊహలలోని రాణీలా అనిపించింది. రాత్రంతా నిద్రపట్టలేదు. ఎవరో ఏమిటో? పేరును అడగలేదు. పల్లెటూర్లో వయసులో ఉన్న అమ్మాయిని పలకరిస్తే తప్పు. చంపేస్తారు, అని భయం. దాంతో మరునాడు అదే వేళకి అక్కడికి హాజరయాను. సరిగ్గా నువ్వు మరింత అందంగా అలంకరించుకుని బారెడు జడతో కవులు వర్ణించే రీతిలో నడుస్తూ వచ్చావు. 'పేరు ఏమిటో అడగవచ్చా?' అన్నాను జ్ఞాపకం ఉందా? 'మీకు నచ్చిన పేరు పెట్టుకోండి!' అని, కిలా కిలా నవ్వావు. నా వళ్ళు జల్లు మంది. 'చక్కెర బొమ్మ' అన్నాను. నవ్వులోనూ కులికావు. నువ్వెవరవో అడుగుదామనుకున్నంతలోనే తూనీగలాగా వెళ్ళిపోయావు. ఇంటికి వెళ్ళి మా అమ్మతో జరిగినదంతా చెప్పాను. అంతా విని 'ఎవరో ఏమిటో తెలియకుండా ప్రేమించాను అంటావేమిట్రా?' అంది.

మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావా? అని నా కళ్ళు వెతికాయి. ఊహూ! వారంరోజులైనా నీ దర్శనం కాలేదు. ఒక రోజున గుళ్ళోకి వెళ్ళాను నువ్వు స్నేహితులతో కబుర్లు చెపుతూ కనిపించావు. 'ఎవరా అమ్మాయి' అని అడిగాను నీ పక్కనున్న అమ్మాయిని. పేరు సీతని నీ వివరాలన్నీ చెప్పింది. మా అమ్మకి పట్టుకు వెళ్ళి సంగతంతా చెప్పాను. 'సరేలే వాళ్ళ బామ్మగారు నాకు తెలుసును. ఆ అమ్మాయిది ఈ ఊరు కాదు' అంది.

మరునాడు మీబామ్మ దగ్గిరకి వెళ్ళి వివరాలు కనుక్కుంది.' ఆమె పెద్ద కొడుకు కూతురుట, బాగా డబ్బున్నవాళ్ళ అమ్మాయిరా' అంది, 'ఇంకా మంచిది కదా?' అన్నాను. ఆ తర్వాత మన పెళ్ళి కలయిక అందమైన అనుభూతి ఊహాల్లోకాల్లోకి

వెళ్లిపోయాను. మా అమ్మ నన్ను చూసి నవ్వి 'నేను వెళ్ళి వాళ్ళ బామ్మను కలిసి వివరాలు తెచ్చాను' అని చెప్పింది. 'నా స్నేహితురాల్ని పెళ్ళి వివరాలు అడగమని, అన్నీ తెలుసుకున్నాను. కాని, వాళ్ళు వచ్చి మనల్ని అడగాలి కానీ, నేను అలా వెళ్లేదాన్ని కాదురోయి!' అంది. అయితే మరి ఎలాగా? అని, ఆలోచించసాగాను. ఒక రోజున చెర్లో నీళ్ళు పోసుకుంటూంటే, ఒక పెద్దామె వచ్చి, నన్ను చూసి 'బాబూ నువ్వు ఫలానావారి అబ్బాయి కదూ?' అంది. 'అవును' అన్నాను, నా దగ్గిరగా వచ్చి నా గెడ్డం పుణికి 'మా సీతని పెళ్ళి చేసుకుంటావా?' అని అడిగింది. నాకు సంతోషమూ కోపమూ కూడా వచ్చాయి అందరిలో అడిగిందనీ. తీరా ఆరాతీస్తే మామ్మగారేనని తెలిసి, ఇదేదో శుభసూచకంగానే ఉందేమిటి? అని ఆలోచించసాగాను.

ఇంతలోకి రాత్రి మా అమ్మానాన్నగారూ వచ్చి 'నీవనుకున్న అమ్మాయిని వాళ్ళేవచ్చి, నీకిచ్చి పెళ్ళి చేయాలని ఉంద'ని అడిగారు. 'మీరేం చెప్పారు?' అన్నాను. 'నిన్ను అడిగి చెపుతామన్నాము మొగ పెళ్ళివారం కదా? బెట్టుగా ఉండాలనీ, మాకేమో ఆ అమ్మాయి ఇష్టమే మరి' అన్నారు. నేనూ ఓకే అన్నాను. ఆ తర్వాత రసవత్తర ఘట్టాలన్నీ నీకూ తెలుసును. మరి ఇంతకీ ఆ కాళీని ఏం చెయ్యమంటావు?" అన్నాడు శ్యామ్.

ప్రేమకి, భర్త శ్యామ్ పసిపిల్లవాడిలా కనిపించాడు. నవ్వుకుంది.

'ఏమిటలా, నవ్వుతావు, భర్త ఇంకొక అమ్మాయిని ప్రేమిస్తోంటే ఏడవాలికాని" అన్నాడు శ్యామ్ కోపంగా.

"మరి ఏం చెయ్యను! మన ప్రేమ మధుర ప్రేమ అంటున్నారు. ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోకపోతే చచ్చిపోతోందంటున్నారు. ఇంతకీ మన పెళ్ళి అయి, పట్టుమని నెల రోజులు అవలేదు. మీకు పసిపిల్లవాడి మనసు ఉందని నవ్వువచ్చింది" అంది ప్రేమ.

"సీత పేరు మార్చి ప్రేమాఅని పిలుస్తున్నారు" అంది ఓరగా చూస్తూను.

"నీతో, మాట్లాడ్డం మహా కష్టం. మాటకారివి, మరి ఏం చెయ్యను? నువ్వు ఏదేనా సలహా చెప్పు. తీరా నిన్న గోదారి ఒడ్డున కనిపించింది. 'ఇలా వచ్చావేమిటి?' అని అడిగితే కోపంతో అరిచి 'నాకు చెప్పకుండా పెళ్ళి చేసుకున్నావు, నాకంటే అందమైనది అయితే అవచ్చును. కాని, నా ప్రేమ ఏం కాను? మీ అక్కాబావా ఇంటికి కొత్త దంపతులుగా వచ్చిన రోజు నుంచి నా బాధ ఎలా చెప్పను? నన్ను మోసం చేసావు.'

అని ఏడ్చేసింది కాళి. దాంతో నా మనసు కరిగిపోయి, ఎక్కడ నిండుప్రాణాన్ని బలిగొంటుందోనని, మానవత్వంతో 'నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అని ఊరడించాను. ఇప్పుడెలాగా నువ్వు లేకపోయినా బ్రతకలేను" అని శ్యామ్ దిగులుగా అయిపోయాడు.

ప్రేమకి నిన్న తనని చూసి, ఈర్ష్యతో కావాలని తలుపును తన్ని వెళ్ళింది. 'ఆ అమ్మాయి అలా ఉందేం?' అని అడిగితే మీ అక్కయ్య 'ఆ అమ్మాయి అంతే! ప్రతీదీ తనకి ఇష్టమైనట్లు జరగాలి, మా తమ్ముడు తనని పెళ్ళి చేసుకోమని అడక్కుండా నీతో పెళ్ళి అయిందని కోపం. పైగా మమ్మల్ని ఇల్లు కాళీ చెయ్యమని ఒకటే గొడవ, ఆయనకి ఆఫీసు దగ్గరని ఉన్నాం కాని ఇంట్లో సదుపాయం ఉండి కాదు. ఆమాటే అన్నాను. అదే కోపం. ఆ పిల్లతో తల్లి పడలేక గోలపెడుతోంది' అన్నారు" అంది ప్రేమ.

సీత పేరు నీదని, నేను ప్రేమ అని పిలుస్తున్నానని తెలుసుకుని ఈర్ష్యపడుతోంది. ఇంతకీ నాకు మతిపోతోంది నిన్ను కాదని దాన్ని పెళ్ళి చేసుకోలేను.అలాగని దాని బాధ -నా కోసం ఒక స్త్రీ చచ్చిపోయిందని అపకీర్తి తలుచుకుంటేనే భయంగా ఉంది" అన్నాడు శ్యామ్.

ప్రేమ పకపక నవ్వి "నేను ఒక ఉపాయం చెపుతాను. ఆ అమ్మాయిని నా దగ్గరకొచ్చి అడగమను. తర్వాత వాళ్ళ అమ్మను అడగమను. ఇద్దరూ ఒప్పుకుంటే వెంటనే మన పెళ్ళికి లైను క్లియరు అని చెప్పు" అంది ప్రేమ.

ఆ మరునాడు దొడ్లో జామచెట్టు దగ్గిర ప్రేమ నుంచుని ఉంది, పక్కన ఎవరూ లేరు డాబా మెట్లు దిగివచ్చి కాళీ, "సీతా నిన్ను ఒకటి అడగనా?" అంది.

"సరే అడుగు" అంది ఏమీ తెలియనట్లు.

"మీ ఆయన నన్ను పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చాడు. నువ్వేం అంటావు?" అంది. కాళీ "ఏమంటాను? పెళ్ళి చేసుకో!"

"మరి నువ్వు?" అంది కాళీ.

"నేను చదువుకుని మంచి ఉద్యోగం చేయాలని ఉంది" అంది ప్రేమ.

"మరి మీ ప్రేమ ఫేలైనట్లే కదా" అంది కాళీ.

"కొంత మంది రాక్షస గణాన పుడతారని శూర్పణఖ ఆ కోవకి చెందినదేనని మా అమ్మ చెప్పింది."

"నన్ను అంతమాట అంటావా? నీతో ఉంటాడో, నాతో ఉంటాడో అడిగి తేల్చేస్తాము"

అంటూ విసవిసా వెళ్ళిపోతూ కొరకొరా చూసింది.

ఆ వెళ్ళడం తిన్నగా తల్లిదగ్గిరకి వెళ్ళింది కాళీ, "నన్ను శ్యాము పెళ్ళి చేసుకుంటున్నాడు నీ అభిప్రాయం?" అంది.

కాళీ తల్లి ఆశ్చర్యపోయి "అదేమిటే నెలరోజులు అవలేదు ఆ సీతని చేసుకుని" అంది. "నీకేం తెలియదు. ఎప్పటినుంచో అతన్ని ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకోకపోతే గోదావరిలో పడి చస్తానని బెదిరించాను. దాంతో ఒప్పుకున్నాడు. పైగా అతని భార్యని ఇప్పుడే అడిగాను. చేసుకో అంది. నువ్వు ఊ అంటే గుళ్ళో పెళ్లి చేసుకుంటాను అంది కాళీ.

"ఆ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడని, చాలా డబ్బున్నవారి అమ్మాయని, సీత పేరు మార్చి ప్రేమ అని పిలుస్తాడనీ వాళ్ళ అక్క నిన్ననే నాకు చెప్పిందే!" అంది కోపంగా కళ్ళు ఎర్ర చేస్తూ అంది కాళీ వాళ్ళ అమ్మ.

"శ్యామ్‌ని నేను ప్రేమిస్తున్నానంతే!"

"అతను నిన్ను ప్రేమించటంలేదు."

కాళీ "అదేం కుదరదు. అతన్ని బెదిరించేనా అతనితో ఈ పెళ్ళి జరగాల్సిందేను" అంది.

"నీకు మతి పోయిందే, రెండో పెళ్ళాంగా వెళతావే, ఈ ముక్కోణపు ప్రేమ ఏమి ఖర్మమే. ఈ శ్యామ్‌తో నీ పెళ్ళి జర్గగడానికి వీల్లేదు. మీ నాన్నతో చచ్చేదాకా నానా అవస్థపడ్డాను. గోదారొడ్డున ఒకత్తిని పెట్టి రోజూ పోతూ ఉండేవాడు. వాడికి పుట్టిన పిల్లవు ఇంతకంటే మంచి ఆలోచనలు, నీకు ఎలావస్తాయి ఖర్మ, ఖర్మ" అని ఏడ్చింది కాళీ వాళ్ళ అమ్మ.

తల్లి అన్న మాటలు రంపపు కోతలా అయింది కాళీకి.

దాంతో "అమ్మా అలా తల బాదుకోకు. శ్యామ్‌ని పెళ్ళి చేసుకోవడం తప్పేనే. ఏడవకు" అని తల్లిని ఊరుకోబెడుతూ ఏడ్చింది కాళీ.ఆ వేళ తల్లికూతుళ్ల అన్నం తినలేదు. శ్యామ్‌కి, కాళీ కనిపించలేదు రెండు రోజులైనాను.

శ్యామ్ వాళ్ళ అక్కాబావా, "శ్యామ్ నువ్వు, సీతా, ఎప్పుడు వెడుతున్నారు మీ ఊరికి?" అని అడిగారు.

"కాళీ ఏ మాట చెప్పలేదు. తను భార్య ప్రేమతో వెళ్ళిపోతే ఆ అమ్మాయి

చచ్చిపోతుందేమోనని భయం! పోనీ వెళ్ళిపోతే ఎలాగ?" అని ఆలోచించి పోనీ ప్రేమని తీసుకెళ్ళి వాళ్ళింట్లో దిగబెట్టి మళ్ళీ రావచ్చునని ప్రేమని తీసుకుని వెళ్ళిపోయాడు శ్యామ్.

ఆ మర్నాడే శ్యామ్ వచ్చాడు. వాళ్ళ అక్కాబావా "ఇదేమిటి? మళ్ళీ వచ్చావు?" అని అడిగారు కొంచెం తడబడి "నాకు రేపు ఇంటర్వ్యూ ఉంది ఈ వూళ్లో. ఇంటికి వెళ్ళేటప్పటికి లెటరు వచ్చింది" అని చెప్తూ 'నాకు పనుంది' అని బజారు వైపుకి వెళ్ళిపోయాడు శ్యామ్.

అహా, ఏదో కారణంలేందే వాడు వచ్చి ఉండడు అనుకుంది శ్యామ్ వాళ్ళ అక్క. వాడు రాగానే నిలదీసి అడగాలి. కాళీతో వీడికి ఏదో ఘర్షణ జరుగుతుందేమోనని కనిపెట్టింది.

కాళీ వాళ్ళమ్మగారు వచ్చి "మా అమ్మాయి నేనూ మా పెద్ద అబ్బాయి ఇంటికి వెడుతున్నాం మేము రావడానికి నెల రోజులు పడుతుంది. మీరు మేము వచ్చే లోపున ఇల్లు ఖాళీ చెయ్యాల్సి ఉంటుంది. మా అమ్మాయి పెళ్ళి చేద్దామనుకుంటున్నాము. గట్టిగా చెపుతున్నాను" అని చెప్పి వెళ్ళిపోయింది.

రాత్రి శ్యామ్ ఇంటికి వచ్చి అన్నంతింటూ, "కాళీ వాళ్ళిల్లు తాళం పెట్టి ఉందేమిటి?" అని అడిగాడు. సంగతంతా చెప్పింది శ్యామ్‌కి.

" నేను రేపే వెళ్ళిపోతున్నాను" అని చెప్పి శ్యామ్ తన ఊరికి వెళ్ళిపోయాడు.

ప్రేమ, శ్యామ్‌ని అడిగింది ఏం జరిగిందని.

" ఏమో వాళ్ళు నెల రోజుల దాకా రారుట, కాళీ పెళ్ళిట మీ అక్కనీ బావనీ ఇల్లు కాళీ చెయ్యమన్నారుట" అన్నాడు శ్యామ్.

"అయితే వాళ్ళ అమ్మగారు గట్టి చీవాట్లు పెట్టి ఉంటారు- రెండో పెళ్ళి ఏమిటి అని, ప్రస్తుతం మన సమస్య తీరింది కదా?" అంది ప్రేమ.కొద్దిరోజులకు ఒక ఉత్తరం వచ్చింది.

"మీ ఎడ్రసు మీ అక్కగారిని అడిగి తీసుకున్నాను. ఇంతవరకూ జరిగిన దానికి చింతిస్తున్నాను. ఉత్తములైన మీ భార్యభర్తల మధ్య దుమారం లేపాను. నన్ను క్షమించమని అడుగుతున్నాను. మీ ప్రేమని చూస్తే నాకు ఈర్ష్య వచ్చింది. మా అమ్మ నాకు కనువిప్పు కలిగించింది" అని రాసింది కాళీ.

శ్యామ్ ప్రేమని కావలించుకుని, "నాకు పెద్ద సహాయం చేసావు. ఒక సమస్య నుంచి బయటికి తీసావు. భార్యలందరూ, భర్తలని అర్థంచేసుకుంటే కాపురాలు చల్లగా సాగుతాయి. మా మగవాళ్ళది ఒట్టి జాలి గుండె అనుకో. నిజంగా ప్రేమ ఉన్నది నీమీదే." అన్నాడు.

ప్రేమ పకపక నవ్వి "ఈ జాలి గుండెలతో ఎంతమంది నిరీక్షిస్తారు?" అంది.

"నా జీవితంలో ఇలాంటి కేసు రానివ్వను సరా" అన్నాడు శ్యామ్.

"ఒడిదుడుకులు వచ్చినప్పుడే భార్యని భర్త, భర్తని భార్య అర్థంచేసుకుని బైటికి రావాలి, అంతేగాని సమస్యలొచ్చాయని..... ఏడుస్తూ ఉండకూడదు" అంది ప్రేమ.

శ్యామ్, ప్రేమా, తమ చిన్న కారులో వెడుతూంటే బస్సు స్టేండులో ముగ్గురు పిల్లలతో ఓ పెట్టి మీద కూచుని కాళీ కనిపించింది.శ్యామ్ ఒక నిట్టూర్పు విడిచాడు.

ప్రేమ అంది "శ్యామ్ మన సానుభూతి చూపిద్దామన్నా పలకరిద్దామన్నా ఏం ప్రమాదమో కాళీతో అని భయం వేస్తోంది అని.

"ఎవరి అదృష్టం వాళ్ళది" అన్నాడు శ్యామ్.

"ఈర్ష్య, ద్వేషంతో ఎవరినీ నిందించను" అంది ప్రేమ.

" నీ ఉత్తమమైన ఆలోచనలే నిన్ను రక్షించాయి" అన్నాడు శ్యామ్ అనురాగంతో చూస్తూ.

కారు, మెత్తగా మెయిన్ రోడ్‌లో పూల పడవలా వెడుతోంది. కొందరి జీవితాలు అంతే, అందంగా ఉంటాయి. గతుకుల రోడ్‌లో ప్రయాణం చెయ్యాలి మరి. ముక్కోణపు ప్రేమ కుదరదు. జీవితానికి అడ్డుదోవలుండవు. రహదారి దర్జాగా ఉంటుంది.

ప్రేమ, శ్యామ్‌ను చూసి, ఆనందించేవారు ఎందరున్నారో ఈర్ష్యపడేవాళ్ళు కూడా అంతమంది ఉన్నారు.సత్ప్రవర్తన, మంచి సుగుణాలూ ఉంటే, జీవితం రాచబాటే అవుతుంది. అందుకు సాక్షాలు, ప్రేమ, శ్యామూను.

❄❄❄

(అముద్రితం 2004)